క్లుప్తంగా

రేపు అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై డిసెంబర్ ఒకటిన అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకొని వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ప్రతిభా పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో సినీ నటులు అశోక్ కుమార్, దర్శకులు సీహెచ్. రజిత మూర్తి, వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి, టీవీ నటులు విడదల సాంబశివరావు, డాక్టర్ ఎ.ఎస్.ఆర్. పి. సూరిబాబు, కవి ఐనాల మల్లేశ్వరరావు, ఎస్.వి.రామారావుకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా రంగోలి పోటీలు



గుంటూరు మెడికల్: వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని బుధవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో రంగోలి పోటీలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, అందమైన ముగ్గులతో అలరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన పెరగడం ద్వారా పాజిటివ్ కేసులు బాగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో హెచ్ఐవీ బాధితులు వివక్షతకు గురవుతున్నారని, దీన్ని రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్హెచ్ఎంవో డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఐసీటీసీ జిల్లా సూపర్వైజర్ జ్యోతుల వీరాస్వామి పాల్గొన్నారు.

3న పద్మశాలీ సంఘీయుల కార్తిక వన సమారాధన

నెహ్రూనగర్: పద్మశాలీ సంఘీయుల కార్తిక వన సమారాధన డిసెంబర్ 3న నారాకోడూరులో నిర్వహించనున్నట్లు పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాస్థాయి సంఘ ప్రముఖుల సందేశాలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఫార్మసీ సూపర్వైజర్గా కృష్ణకుమారికి పదోన్నతి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఫార్మసీ విభాగంలో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణకుమారికి సూపర్వైజర్గా పదోన్నతి లభించింది. ఆమెను గుంటూరు నుంచి ఒంగోలు డీఎంహెచ్వో కార్యాలయానికి బదిలీ చేశారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆమెకు పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావుకు ప్రమోషన్ ఇచ్చి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్వైజర్గా బదిలీ చేశారు. నెల్లూరు జీజీహెచ్లో పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లుకు ఫార్మసీ సూపర్వైజర్గా ప్రమోషన్ ఇచ్చి ఒంగోలు జీజీహెచ్కు బదిలీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటుగా సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ బి.అనిల్ శ్యామ్ బాబు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఆగంతకుడు పరారైన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్కు చెందిన అద్దేపల్లి భవాని బుధవారం రైతుబజారుకు వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఓ ఆగంతకుడు భవానీ సమీపానికి వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న బీహెచ్ హైస్కూలు పూర్వ విద్యార్థినుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేట రెండో లైనులోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినుల సమావేశాన్ని డిసెంబర్ 3న పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంఘ చైర్పర్సన్ జయశ్రీ, కన్వీనర్ గోవిందరాజుల సంధ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 1953 నుంచి ఇప్పటి వరకు చదివి దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థినులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి రవాణా శాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, పూర్వ ఉపాధ్యాయుల్ని సత్కరించనున్నట్లు తెలియజేశారు. పూర్వ విద్యార్థినులంతా సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

పేదల జీవన ప్రమాణాల మెరుగుకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 23వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తెనాలి: 'పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే నేరుగా వారి చేతికి డబ్బులివ్వండి...ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుకోవాలంటే ఖర్చు చేయడమే ఏకైక మార్గం..' అని చెప్పిన నోబెల్ బహుమతి గ్రహీతలైన ఆర్థికవేత్తల సిద్ధాంతాలను సంక్షేమ పథకాలతో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ 23వ వార్డులో 28వ సచివాలయానికి సంబంధించి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సభకు వార్డు పార్టీ నేత ఎస్.రఘురామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ 23వ వార్డులోనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు రూ.55 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి వదిలేసిన డ్వాక్రా మహిళలకు రుణమాఫీని జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం ఏటా చెల్లిస్తున్నట్లు వివరించారు. నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం ఇటీవల ఉచిత వైద్య శిబిరాలను జరిపినట్టు గుర్తు చేశారు. గర్భిణులకు సంపూర్ణ పోషణ ఇవ్వటమే కాకుండా పుట్టిన పిల్లల ఆరోగ్యం, చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటోందని సోదాహరణంగా వివరించారు. మీ నమ్మకాన్ని నిలుపుకుంటూ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని, తననూ ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యే శివకుమార్కు మద్దతునివ్వాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్కు జగన్ ఎందుకు కావాలంటే బుక్లెట్ను, సచివాలయం పరిధిలో సంక్షేమం పథకాలు, లబ్ధిదారుల సంఖ్య, అందించిన



బుక్లెట్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే శివకుమార్, వేదికపై చైర్పర్సన్ రాధిక

మొత్తం వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. వార్డు కౌన్సిలరు తోక శిరీష, వైఎస్సార్ సీపీ క్లస్టరు అధ్యక్షుడు షేక్ దుబాయ్బాబు, పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, పెసర్లంక రమణ, తోక వాసు, బోడె సుబ్రహ్మణ్యం, జిలాని, సురేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

చివలూరు(కొల్లిపర): సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ అని ఎంపీపీ భీమవరపు పద్మావతిసంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అన్నారు. మండలంలోని చివలూరు గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం బుధవార నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పార్టీ జెండా ఎగురవేశారు. సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. మండల కన్వీనర్ పోతిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమ, విద్య, వైద్య రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో సీఎం వైఎస్ జగన్ నిలబెట్టారని చెప్పారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి తిరుగుతూ జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్లెట్స్, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి బొంతు వేణుగోపాలరెడ్డి, శిరిపురం సర్పంచి పచ్చవ సులోచనరాణి, ఎంపీటీసీ కారుమంచి పృధ్వీకుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ వి. చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ బీహెచ్ మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

కొలవరంలో పల్లెకు పోదాం కార్యక్రమం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలవరంలోని సచివాలయం-1 పరిధిలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. మర్లమ్మగుడి సెంటర్లో పార్టీ జెండాను ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు ఆవిష్కరించారు. అక్కడ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఉమాప్రణతి, గ్రామ సర్పంచి బండికళ్ల ప్రసాద్, ఉపసర్పంచి షేక్ బాబూ సాహెబ్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, పార్టీ నాయకులు కె.సుదర్శన్, టి.సువర్ణబాబు, ఎం.శివన్నారాయణ, శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్, ఈఓపీఆర్డీ సుభాష్చంద్రబోస్ పాల్గొన్నారు.



చివలూరులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ పద్మావతి సంజీవరెడ్డి, పోతిరెడ్డి



దివ్యాంగుడికి సంక్షేమ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాప్రణతి

నేడు 6, 25 వార్డులలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని 6, 25 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ వార్డు గాంధీనగర్-2, 25వ వార్డు పినపాడు-2 సచివాలయాల వద్ద సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

మూడు లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీలను స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు గుర్తించి జరిమానా విధించారు. కొల్లిపర మండలంలో ఎస్ఈబీ తెనాలి ఇన్స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మూడు లారీలు అధిక లోడుతో వెళుతుండడాన్ని గుర్తించారు. ఒక లారీకి రూ.ఏడు వేలు, రెండు లారీలకు రూ. ఎనిమిది వేలు చొప్పున జరిమానా విధించారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన



తెనాలి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె.రవిబాబు కోరారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కాలేజిలో 'స్వీప్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఓటరుగా నమోదు, ఈవీఎంల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 17 ఏళ్లు నిండిన విద్యార్థుల వివరాలను సేకరించి, వారి ప్రాంత పరిధిలోని బీఎల్ఓలకు అందజేశారు. ఈ విధంగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టినట్టు రవిబాబు తెలిపారు. సామాజిక మాధ్యమాలతోనూ ఓటు నమోదుపై ప్రచారంతో అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. ఆర్ఐ యు.జాన్, నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి, వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

హెచ్సీ, ఏఎస్ఐలకు అవుట్డోర్ పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు రేంజ్లోని 37 మంది హెచ్సీ, ఏఎస్ఐలకు బుధవారం పోలీస్పెరేడ్ గ్రౌండ్లో అవుట్డోర్ పరీక్షల్ని నిర్వహించారు. ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు ఈనెల 28న అర్హత పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం కవాతు, మౌఖిక, ఆయుధాలకు సంబంధించి, నేరాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించే పరీక్షలతో పాటు నైపుణ్య పరీక్షలు జరిగాయి. మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ ఎస్వీ ఎస్ఎస్.సుబ్బారెడ్డి, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్ పర్యవేక్షించారు.

వరి కోతలు ప్రారంభం

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరం చేశారు. భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు, కొల్లూరు, వేమూరు మండలాలల్లో కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో కోతలు చేపట్టారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్గా మారి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ నేపథ్యంలో రైతులు రైతులు హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గంలో 95 వేల ఎకరాల్లో హార్వెస్టర్ ద్వారా వరి కోతలకు అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలుకు పైగా దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

వెయిట్లిఫ్టింగ్లో ఏఎస్ఎన్ ఓవరాల్ చాంపియన్

- 14వ సారి ఘనత
- బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్మెన్, స్ట్రాంగ్ విమెన్ అవార్డులు

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల వెయిట్లిఫ్టింగ్ చాంపియన్షిప్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి పురుషుల జట్టు అద్భుత ప్రతిభను చాటి ఓవరాల్ టీమ్ చాంపియన్షిప్ను సాధించింది. 14వ పర్యాయం రోలింగ్ ట్రోఫీని స్వీకరించింది. ఈ జట్టులోని లిఫ్టర్లను బుధవారం సాయంత్రం కాలేజిలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్చంద్ అభినందించారు. యూనివర్సిటీ క్యాంపస్లోని యూనివర్సిటీ వ్యాయామ కాలేజి ఈ పోటీలను నిర్వహించింది. 67 కిలోల విభాగంలో ముద్దా తిరుపతిరావు, 89 కిలోల విభాగంలో గండికోట సందీప్కుమార్, 96 కిలోల విభాగంలో అంబళ్ల కోమలకార్తీక్, 109 ప్లస్ కేటగిరీలో పాలేరు భార్గవ్రామ్ బంగారు పతకాలను సాధించినట్టు కాలేజి వ్యాయామ అధ్యాపకుడు/శిక్షకుడు డాక్టర్ నల్లక శేషగిరిరావు చెప్పారు. జట్టులోని అంబళ్ల కోమలకార్తీక్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్ మెన్ టైటిల్స్ను సాధించాడు. మహిళల విభాగంలో కాలేజికి చెందిన డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థిని తాడిశెట్టి రేణుక 71 కిలోల విభాగంలో పోటీపడి బంగారు పతకంతో పాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్ విమెన్ టైటిల్స్ను గెలుచుకోవటం మరో విశేషమన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్లిఫ్టింగ్ చాంపియన్షిప్ పోటీల్లో కాలేజి లిఫ్టరు అంబళ్ల కోమల కార్తీక్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బంగారు పతకాలతోపాటు స్ట్రాంగ్ మెన్ టైటిల్ను గెలిచాడు. మహిళల కేటగిరీలో తాడిశెట్టి రేణుక జూనియర్స్లో బంగారు పతకం, సీనియర్స్లో రజత పతకం గెలిచినట్టు వివరించారు.



కాలేజి జట్టు లిఫ్టర్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్చంద్. పక్కన శేషగిరిరావు

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గ్రామంలో గ్రామ సచివాలయం- 2, వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య చికిత్సా కేంద్రం(హెల్త్ వెల్నెస్ సెంటర్)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలను సీఎం వైఎస్ జగన్ చేరువ చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి వల్లభాపురం నిర్మల, తెనాలి మార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అద్దంకి బోసుబాబు, ఎంపీటీసీలు కేశన రజని, దానబోయిన సర్వేశ్వరరావు, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, మండల వైద్యాధికారులు చిక్కాల లక్ష్మీసుధ, వేముల ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి అలక నందన పాల్గొన్నారు.



వల్లభాపురంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కర్రసాములో నగర విద్యార్థినికి బంగారు పతకం

గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ ట్రెడిషనల్ సిలంబం చాంపియన్షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్రసాము పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 6వ తరగతి విద్యార్థిని ఎం. జగీశ్వకృష్ణ సిలంబంలో బంగారు పతకాన్ని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఏ. నిహారిక విన్నర్గా నిలిచినట్లు వివరించారు. చదువుతో పాటు విద్యార్థుల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తూ జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, సీనియర్ కో-ఆర్డినేటర్ దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు

డిసెంబర్ 19, 20 తేదీల్లో బాలోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 19, 20వ తేదీల్లో మంగళగిరి మండలం యర్రబాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్లో నిర్వహించనున్న మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం(రెండో పిల్లల పండుగ) బ్రోచర్ను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మొత్తం 42 రకాల అకడమిక్, కల్చరల్ పోటీలు బాలోత్సవంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తుళ్లూరు, రాజధాని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ పండుగలో పాల్గొనాలని కోరారు. ఉరుకుల, పరుగుల జీవితంలో పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించే తీరిక లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయని అన్నారు. బాలల్లో ప్రతిభా పాటవాలు, శక్తి, సామర్థ్యాలు పెరుగుతుండగా, సినిమాలు, సాంస్కృతిక రూపాలు సైతం సెల్ఫోన్లు, ఇంటర్నెట్, టీవీల ద్వారా పిల్లలకు అందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఆట పాటలు, వ్యాయామం శారీరక శ్రమ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటీఎంసీ బాలోత్సవం గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షుడు వీవీ ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవం విజయవంతానికి ఇప్పటికే 150 పాఠశాలలకు బ్రోచర్లు అందచేశామని చెప్పారు. రెండ్రోజులపాటు జరిగే ఈ పిల్లల పండుగకు సుమారు 4వేల మంది పిల్లలు హాజరవుతారన్నారు. ఉపాధ్యక్షుడు యడ్ల బాలకృష్ణ, కార్యదర్శి ప్రగడా రాజశేఖర్, పి.శ్రీలక్ష్మి, జె.శేషయ్య, కోశాధికారి గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



బాలోత్సవం బ్రోచర్ విడుదల చేస్తున్న డీఈఓ శైలజ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

సాఫ్ట్వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

ఏఎన్యూ: సాఫ్ట్వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని సాఫ్ట్వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్, ఆఫీసర్ ఇన్చార్జి బి. వినయ్ కుమార్ తెలిపారు. సాఫ్ట్వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్యూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులకు లీప్ ఏ హెడ్ పేరుతో స్టార్టప్ అండ్ ఇంక్యుబేషన్ సంబంధిత అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ రంగంలో ప్రస్తుతం స్టార్టప్, ఇంక్యుబేషన్లకు అధిక ప్రాధాన్యత లభిస్తోందన్నారు. విద్యార్థులంతా విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. నూతన ఆలోచనలతో, కొత్త ప్రయోగాలపై దృష్టి సారించాలని సూచించారు. సాఫ్ట్వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా డెప్యూటీ డైరెక్టర్ డి. కిరణ్ కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ దానిపై పట్టు సాధించాలని తెలిపారు. మిలట్రానిక్ కంపెనీ సీఈవో లోకేష్ తన స్టార్టప్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వినయ్ కుమార్ను వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అభినందించారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, సీఎస్ఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. బాలాజీ, ప్లేస్మెంటు అండ్ డెవలప్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సర్వో మేధ సంస్థ క్యాంపస్ ప్లేస్మెంటును నిర్వహించిందని కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈసీఈ, ట్రిపుల్ఈ, మెకానికల్ విద్యార్థులకు ఆన్లైన్ అసెస్మెంట్ ఎగ్జామ్ నిర్వహించినట్లు ఆయన చెప్పారు.



వినయ్కుమార్కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన గాయపడిన సుల్తానాబాద్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. తెనాలి మండలం సంగంజాగర్లమూడికి చెందిన చింతకాయల రామకృష్ణ, చేబ్రోలు మండలం వడ్లమూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఎకో అసిస్టెంట్గా పని చేస్తున్నాడు. భార్య దివ్యశ్రావణి, తల్లి వెంకాయమ్మలతో కలసి బైక్పై తెనాలి వచ్చాడు. కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి తిరుగుప్రయాణంలో ఉండగా సుల్తానాబాద్ వద్ద వేగంగా వెళుతున్న గుర్తు తెలియని కారు వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లింది. దీంతో ముగ్గురూ ఒక్కసారిగా రోడ్డుమీద పడిపోయారు. గాయపడిన వీరిని వడ్లమూడిలోని వైద్యశాలకు తరలించారు. భార్యాభర్తలు దివ్యశ్రావణి, రామకృష్ణలకు శస్త్రచికిత్స చేసి వెంటిలేటర్పై చికిత్స అందిస్తున్నారు. వెంకాయమ్మ ఐసీయూలో చికిత్స పొందుతోంది. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. బుధవారం కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అనధికార వెంచర్లు తొలగిస్తాం

గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు రూరల్: నగర శివారుల్లో నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసే వెంచర్లు లేదా లే అవుట్స్ని తొలగిస్తామని గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం నగర పరిధిలోని ఏటుకూరు, లాలుపురం డొంక రోడ్డు, నల్లపాడు ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్ల హద్దు రాళ్లు, మార్కింగ్, రోడ్లను డీసీపీ కోటయ్య ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళికాధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్కి వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసే ముందు అనుమతుల్ని పరిశీలించుకోవాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో సమస్యలు వస్తాయని సూచించారు. అనధికార లే అవుట్స్ని తొలగించడానికి సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళికాధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని ఆమె చెప్పారు. అనధికార లే అవుట్స్ తొలగించడంతో పాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంచర్ల నిర్వాహకులు కూడా జీఎంసీ నుంచి అనుమతుల మంజూరు సులభతరం చేసినందున, అనధికార లే అవుట్స్ ఏర్పాటు చేసి సమస్యలకు గురికావద్దని ఆమె సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించిన వెంచర్ల యజమానులకు వెంటనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపామని పేర్కొన్నారు.



అనధికార లే అవుట్స్లో హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జాతీయ కుంగ్ఫూ పోటీల్లో పతకాలు



తెనాలి: న్యూ మంక్స్ కుంగ్ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన రెండో జాతీయస్థాయి ఓపెన్ కుంగ్ఫూ, కరాటే, ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్-2023 పోటీల్లో స్థానిక నెహ్రూ నికేతన్ బాలబాలికలు పతకాలను సాధించారు. అండర్-10 విభాగంలో డి.రుత్విక్ బంగారు పతకాన్ని, ఆర్.నవనీత్ సంతోష్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. అండర్-11 విభాగంలో కేవీఎస్ మోనిక, అండర్-14లో కె.జోషితలు కాంస్య పతకాలను సాధించారు. నిర్వాహకులు పంపిన ధ్రువపత్రాలు, పతకాలను బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి విజేతలకు అందించి అభినందించారు.